నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 | హైదరాబాద్, గురువారం 14 మార్చి 2024 | YADADRI BHUVANAGIRI

అధిక కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరి అర్బన్, మార్చి 13 : జిల్లాలోని అన్ని కోర్టుల్లో రాజీకి ఆమోదయోగ్యమైన అధిక కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు అన్నారు. ఈ నెల 16న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై బుధవారం భువనగిరి కోర్టులో కో ఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీకి ఆమోదయోగ్యమైన కేసులను ఇప్పటికే 5వేలకు పైగా గుర్తించి పరిష్కారం కోసం ప్రత్యేక లోక్ అదాలత్ బెంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల న్యాయమూర్తులు కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. పోలీస్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని పెండింగ్‌లో ఉన్న రాజీకి ఆమోదమయ్యే క్రిమినల్ కేసులను పరిష్కరించే విధంగా కృషి చేయాలని సూచించారు. నేర తీవ్రత ఎక్కువ ఉన్న కేసులపై దృష్టి సారించాలన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శాంతి, స్నేహశైలితో జీవనం సాగించాలని సూచించారు. సమావేశంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.మారు తీదేవి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.దశరథ రామయ్య, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు, భువనగిరి ఏసీపీ రవికిరణ్ పాల్గొన్నారు.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, మార్చి 13 : పదో తరగతి వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం వివిధ శాఖల అధికారులతో పదో తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18నుంచి ఏప్రిల్ 2వరకు ప్రతిరోజూ ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఇందు కోసం జిల్లాలో 51 కేంద్రాలను ఏర్పాటు చేశారని, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతి సెంటర్‌కు ఒకటి చొప్పున 51 సిట్టింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. క్షేత్ర స్థాయి పర్యవేక్షణకు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. తాసీల్దార్లు ఎగ్జామ్ సెంటర్లను ఆకస్మికంగా సందర్శించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలు, మండల ప్రధాన కార్యాలయాల సమీపంలో జిరాక్స్ దుకాణాలను మూసివేయాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద వైద్య బృందాలను ఏర్పాటు చేయాలని, అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. పరీక్ష సమయాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ ఎస్ఈకి సూచించారు. విద్యార్థుల కోసం ఉదయం బస్సుల ఫ్రీక్వెన్సీ పెంచాలని, పరీక్ష కేంద్రాలకు ప్రత్యేకంగా అదనపు బస్సులను నడుపాలని యాదగిరిగుట్ట డిపో మేనేజర్‌ను కలెక్టర్ ఆదేశించారు.

సూర్యాపేట ఎస్‌బీఐలో అక్రమాలు

- రూ.5కోట్లు స్వాహా చేసిన అప్పటి మేనేజర్
- ఆలస్యంగా వెలుగులోకి..

సూర్యాపేట సిటీ, మార్చి 13 : జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై గల ఎస్‌బీఐలో గతంలో ఇక్కడ పనిచేసిన మేనేజర్, సిబ్బంది వ్యక్తిగత రుణాల పేరిట సుమారు రూ.5కోట్లు స్వాహా చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బ్యాంకు ఆస్తులను రక్షిస్తూ వినియోగదారులకు సేవలు అందించాల్సిన బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్నవారు కోట్ల రూపాయల బ్యాంకు సొమ్మును కాజేయడం పట్ల పోలీసులు విచారణ చేపడుతున్నారు. ప్రస్తుతం రామంతాపూర్ బ్రాంచి మేనేజర్‌గా వ్యవహరిస్తున్న ఆయన.. అక్కడి బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా సుమారు రూ.3కోట్లు కాజేసినట్లు తేలింది. దాంతో గతంలో సూర్యాపేట ఎస్‌బీఐలో మేనేజర్‌గా పని చేసిన కాలంలో మంజూరు చేయబడిన రుణాలపైనా విచారణ చేపట్టగా.. ఇక్కడి అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. వంద మందికి పైగా వ్యక్తిగత రుణాలు మంజూరు చేసినట్లు చూపి డబ్బును కాజేశారు. ఈ విషయం బ్యాంకింగ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సదరు మేనేజర్, మరొకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ముగిసిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు

భువనగిరి అర్బన్, మార్చి 12 : ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర వార్షిక పరీక్షలు బుధవారంతో ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 30 కేంద్రాల్లో పరీక్షలు సజావుగా జరిగాయి. బుధవారం కెమిస్ట్రీ-1, కామర్స్-1 పరీక్షలు నిర్వహించగా జనరల్ విభాగంలో 4,954 మందికి 4,770 మంది.. ఒకేషనల్ విభాగంలో 1,375 మందికి 1,190 మంది హాజరయ్యారు. మొత్తం 6,329 మంది విద్యార్థులకు 5,960 మంది హాజరైనట్లు జిల్లా నోడల్ ఆఫీసర్ సి.రమణి తెలిపారు.

రెవెన్యూ అడిషనల్ కలెక్టర్‌గా బెన్ షాలోమ్

యాదాద్రి భువనగిరి, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : యాదాద్రి భువనగిరి అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా బెన్ షాలోమ్ బదిలీపై వచ్చారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. షాలోమ్ ప్రస్తుతం హుస్నాబాద్ ఆర్డీఓగా పనిచేస్తున్నారు. జిల్లాలో రెవెన్యూ అడిషనల్ కలెక్టర్‌గా ఉన్న భాస్కర్‌రావును ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారని తొలుత సస్పెండ్ చేయగా, మంగళవారం సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. ఆయనకు ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. ఇక స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్‌ను బదిలీ చేసి రెండు వారాలు గడుస్తున్నా, ఇప్పటి వరకు కొత్త వారిని నియమించలేదు.

శేష వాహనంపై లక్ష్మీనరసింహుడు



శేషవాహనంపై స్వామివారు

వైభవంగా యాదగిరి గుట్ట బ్రహ్మోత్సవాలు

ఉదయం మత్స్యావతారంలో దర్శనమిచ్చిన స్వామివారు



ఆలయ మాఢ వీధుల్లో మత్స్యావతారంలో స్వామి వారి సేవ

యాదగిరిగుట్ట, మార్చి13 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. 3వ రోజు బుధవారం ఉదయం 9 గంటలకు స్వామి వారు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి శేష వాహన సేవలో తిరుమాఢ వీధుల్లో ఊరేగారు. సాయంత్రం 7 గంటలకు నిత్యహోమం, చతుస్థానార్చనలు నిర్వహించారు. వైకుంఠంలో స్వామివారికి నిరంతరం సేవా కైంకర్యాలు చేసిన వ్యక్తి అనంతుడు. అతనే ఆది శేషు. అలాంటి ఆదిశేషుడిలో ప్రవాసుదేవుడిలా స్వామివారిని అలంకరించి ఆస్థానం చేశారు. వేదాలు, పురాణాలతో ప్రార్థించారు. భక్తజన బాంధవుడు లక్ష్మీనారసింహుడు ప్రీతిపాత్రమైన శేష వాహనుడిపై తిరు మాఢ వీధుల్లో ఊరేగారు. బ్రహ్మోత్సవ శుభరాత్రుల్లో యాదగిరి గుట్ట కొండపై జ్వాలాకృతిలో, సర్పాకారంలో వెలసిన స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా ఆదిశేష వాహనాన్ని భక్తులు కనులారా దర్శించుకున్నారు.

శేష వాహనరూఢుడై..

బ్రహ్మోత్సవాల్లో ప్రప్రథమంగా శేష వాహనరూఢుడై భగవానుడు భక్తులకు దర్శనమిచ్చాడు. స్వామి వారి శేష వాహనాన్ని పశ్చిమ రాజగోపురం గుండా ఉత్తరం, తూర్పు, దక్షిణ మాఢ వీధుల్లో ఊరేగించారు. తూర్పు రాజగోపురం ముందు ప్రత్యేక మండపంలో వేంచేపు మండపంలో అధిష్టింప జేసి సేవించారు. శ్రీహరి పాద పద్మములను సమస్కరించేటప్పుడు పాదపీఠంగా ఉన్న ఆదిశేషుడికి సర్వ దేవతాధిపతియైన మహావిష్ణువు ప్రథమ నమస్కార అర్హతను అప్రయత్నంగా అనుగ్రహించడం ఆదిశేషువుపై పరమాత్మకు గల అవ్యాజ్యమైన కృపగా భక్తులు భావిస్తూ శేషవాహనరూఢుడైన అలంకార సేవలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, కార్య నిర్వహణాధికారి రామకృష్ణారావు, డీఈఓ దోర్బల భాస్కర్ శర్మ, ఆలయ ప్రధానార్చకుడు కాండూరి వేంకటాచార్యులు, యజ్ఞాచార్యులు కిరణ్‌కుమారాచార్యులు, ముఖ్య అర్చకులు మంగళగిరి నరసింహమూర్తి, ఉప ప్రధానార్చకులు సురేంద్రాచార్యులు, భాస్కరాచార్యులు, మాధవాచార్యులు, సహాయ కార్యనిర్వహణాధికారి రఘు, గట్టు శ్రవణ్‌కుమార్, పర్యవేక్షకులు సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం లక్ష్మీనరసింహ స్వామి వటపత్రశాయి అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాత్రి హంస వాహనంపై స్వామి వారి సేవ నిర్వహించనున్నారు.

అభిషేకోత్సవం.. అలంకారోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిత్యపూజ కైంకర్యాల అనంతరం స్వామివారికి మూలమంత్ర, మూర్తి మంత్ర హోమాలు యజ్ఞాచార్యులు , పారాయణందారులు, ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకోత్సవం జరిపించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకారంలోని కల్యాణ మండపంలో స్వామివారిని మత్స్యావతారంలో అలంకరించి పశ్చిమ రాజగోపురం గుండా ఉత్తరం, తూర్పు, దక్షిణ మాఢ వీధుల్లో ఊరేగించారు. నాలుగు వేదాలు, పురానాలు, ఉపనిషత్‌లు, దివ్యప్రబంధ పాశుర పఠణాలు కనులపండువగా చేపట్టారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం మహావిష్ణువు అవతార రూపాల్లో స్వామివారిని ఉత్సవాల్లో అలంకరించి సేవించడం అలంకార ఉత్సవాల ప్రత్యేకత అని ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు మత్స్యావతార విశిష్టతను భక్తులకు వివరించారు.

2 గంటలు ఆలస్యం.. ఎండలో భక్తుల ఇబ్బంది

ఉదయం 9 గంటలకు జరుగాల్సిన మత్స్యావతార సేవ ఊరేగింపు 11 గంటలకు నిర్వహించారు. గతంలో మాదిరిగా కాకుండా ఈ సారి తూర్పు రాజగోపురం ముందు సేవను అధిష్ఠించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మొదటగా పశ్చిమ రాజగోపురం ఎదురుగా ప్రత్యేకంగా సిద్ధం చేసిన వేంచేపు మండపంలో సేవను అధిష్ఠించాల్సి ఉంది. కానీ ఉదయం తూర్పు రాజగోపురం వద్దకు కార్యక్రమం మారింది. ఎండవేడి తట్టుకునేందుకు చలువ పందిళ్లు, టెంట్లు లేకపోవడంతో తూర్పు రాజగోపురం ముందు సేవ ప్రాంగణంలో భక్తులు ఇబ్బంది పడ్డారు. అలంకార సేవ అధిష్టించే సేవ ప్రాంగణం మారడంతో వసతుల ఏర్పాటులో జాప్యం జరిగిందని, నేటి నుంచి అలా జరుగకుండా చూస్తామని దేవస్థాన ఈఓ రఘు తెలిపారు.

స్వామివారి అలంకార సేవ సందర్భంగా చలువ పందిరి లేక ఎండలో ఇబ్బంది పడుతున్న భక్తులు

ఇంకింత లోతుకు..

ఇంకుతున్న భూగర్భ జలాలు

ఫిబ్రవరిలో సగటున 8.59మీటర్ల లోతులో పాతాళగంగ

గతేడాదితో పోలిస్తే 2.53 మీటర్లు పడిపోయిన నీటి మట్టం

నారాయణపురం, ఆత్మకూరులో భారీగా ఇంకిన జలాలు

ఫలితంగా వట్టిపోయిన బోర్లు, బావులు

పొలాలకు నీళ్లు అందక ఎండుతున్న పంటలు

జిల్లాలో రోజురోజుకు భూగర్భ జలాలు పడిపోతున్నాయి. వేసవి నేపథ్యంలో పాతాళ గంగ అడుగంటుతున్నది. జిల్లాలో ఈ ఏడాది ఫిబ్రవరిలో సగటున 8.59 మీటర్ల లోతున నీళ్లున్నాయి. గతేడాది ఇదే నెలలో 6.06 మీటర్లలో నీళ్లు ఉండగా 2.53 మీటర్లకు పడిపోయింది. దీంతో బోర్లు, బావులు వట్టిపోతున్నాయి. ఫలితంగా పొలాలకు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయి.

– యాదాద్రి భువనగిరి, మార్చి 13 (నమస్తే తెలంగాణ)

వలిగొండ మండలం నాగిరెడ్డిపల్లిలో వరిపంటకు ట్యాంకర్ ద్వారా నీళ్లు పెడుతున్న కౌలు రైతు కాసాని వెంకటేశ్

భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెం శివారులో ఎండిపోయిన వరి చేను

భూదాన్ పోచంపల్లిలో 150 ఎకరాల్లో ఎండిన వరి

భూదాన్ పోచంపల్లి, మార్చి 13 : భూదాన్ పోచంపల్లి మండలంలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో 28 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. మండలంలో మూసీ పరీవాహక గ్రామాల్లో పంటలకు నీటి ఇబ్బంది లేదు. కానీ బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేసిన రైతుల పరిస్థితి దారుణంగా ఉన్నది. నీళ్లు లేక వరి పంటలు ఎండిపోతున్నాయి. దోతి గూడెం, అంతమ్మగూడెం గ్రామాల్లో సుమారు 150 ఎకరాల్లో వరి పొలాలు ఎండిపోయాయి. ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టగా మొత్తం నష్టమే మిగిలింది. కండ్ల ముందు ఎండిపోతున్న పంటలను కాపాడుకోవడానికి బోరు వేసినా నీళ్లు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఎండిన పంటలను చేసేదేమీ లేక పశువులు, గొర్రెల మేతకు వదిలేస్తున్న దుస్థితి మండలంలో ఏర్పడింది. పంటలు ఎండిపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని అన్నదాతలు కోరుతున్నారు.

సగటున 2.53మీటర్లు ఇంకినయ్..

జిల్లాలో కొన్నేండ్లుగా భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయి. ఏటా గంగమ్మ పైకి ఉబికివచ్చింది. నాలుగు నుంచి ఐదు మీటర్లలోనే నీటిమట్టం ఉండేది. కానీ ఈ ఏడాది వివిధ కారణాలతో భూగర్భ జలాలు ఇంకిపోయాయి. ఈ ఏడాది వానలు సరిగా పడకపోవడంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఫిబ్రవరిలో జిల్లా సగటున 8.59మీటర్ల లోతులోనే నీళ్లు ఉన్నాయి. గతేడాది ఇదే నెలలో 6.06 మీటర్ల మట్టంలో నీళ్లుండగా, ఈ ఏడాది 2.53 మీటర్ల కిందికి ఇంకిపోయాయి. ఇక గత జనవరిలో 7.29 మీటర్ల లోతులోనే నీళ్లున్నాయి.

వట్టిపోయిన బోర్లు, బావులు

భూగర్భ జలాలు ఇంకిపోతుండటంతో నీటి మట్టం తగ్గిపోతున్నది. దాంతో నీళ్లు లేక బోర్లు, బావులు వట్టిపోతున్నాయి. ఇంతకాలం పుష్కలంగా నీళ్లు ఉండటంతో జోరుగా పోసిన బోర్లన్నీ ఎండిపోతున్నాయి. జిల్లాలో దాదాపు అన్ని చోట్లా బోర్ల నుంచి నీళ్లు రావడం తగ్గింది. నీళ్ల కోసం రైతులు వేలు, లక్షలు ఖర్చు పెట్టి బోర్లు వేస్తున్నారు.

ఈ మండలాల్లో మరీ ఘోరం..

జిల్లాలో మండలాల వారీగా చూస్తే కొన్ని చోట్ల భూగర్భ జలాలు ఘోరంగా పడిపోయాయి. అత్యధికంగా సంస్థాన్ నారాయణపురం మండలంలో భారీగా పడిపోయాయి. గతేడాదితో పోలిస్తే 6.14మీటర్ల కిందకు నీళ్లు ఇంకిపోయాయి. ఈ మండలంలో ఫిబ్రవరిలో 13.25మీటర్లు ఉండగా, గతేడాది ఫిబ్రవరిలో 7.11 మీటర్ల దూరంలో భూగర్భ జలాలు ఉన్నాయి. ఇక ఆత్మకూర్ (ఎం)లో 13.89, బొమ్మలరామారంలో 11.15, ఎం.తుర్కపల్లిలో 10.69, బీబీనగర్‌లో 10.14, రామన్నపేటలో 9.92, మోటకొండూర్‌లో 9.57, మోత్కూరులో 9.30, రాజాపేటలో 8.41, భువనగిరిలో 8.34 మీటర్ల లోతులో నీళ్లున్నాయి.

ఎండుతున్న పంటలు..

జిల్లాలో నీళ్లు లేకపోవడంతో పంటలు ఆగమైతున్నాయి. పొట్ట దశకు వచ్చే సమయంలో సరిపడా నీళ్లు లేక పొలాలు ఎండిపోతున్నాయి. చేసేదేం లేక కొంత మంది రైతులు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరందించే ప్రయత్నం చేస్తున్నారు. భువనగిరి, రామన్నపేట తదితర మండలాల్లో రైతులు ట్యాంకర్ల ద్వారా నీళ్లు పెడుతున్నారు. నీళ్లు లేపోవడంతో పంట భూములన్నీ నెర్రెలుబారుతున్నాయి. పంట మొత్తం ఎండి గడ్డిలా మారుతున్నది. దాంతో గేదెలు, మేకలు, గొర్రెలను మేపుతున్న పరిస్థితి దాపురించింది.

సీఎం కుర్చీ కోసమే రేవంత్‌రెడ్డి ఆర్భాటం

- ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలం
- మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

నూతనకల్, మార్చి 13 : రేవంత్‌రెడ్డి సీఎం కుర్చీ కోసమే ఆర్భాటాలు తప్ప ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ విమర్శించారు. నూతనకల్ మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా మాట్లాడుతున్నారని, ముఖ్యమంత్రి అని మర్చి పోయాడన్నారు. ఉమ్మడి నల్లగొండ రైతులు ఆగమైతున్నారని, సాగు నీరు అందించి పంటలను కాపాడాలని కోరారు. సాగర్ కాల్వ కింద 3.5 లక్షల ఎకరాలు నీళ్లు లేక ఎండి పోతున్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన ఉద్యోగ నియామకాలకు కాగితాలు ఇచ్చి తామే ఉద్యోగాలు ఇచ్చామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మరని తెలిపారు. కేసీఆర్ సర్కారు హయాంలో జరిగిన పనులకే కాంగ్రెస్ ప్రభుత్వం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నదని మండిపడ్డారు. చేతకాని దద్దమ్మ సీఎం రేవంత్‌రెడ్డి కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకీ అప్పగించారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో మళ్లీ కరువు, కాటకాలు పునరావృతం అవుతున్నాయని విమర్శించారు. రైతులకు కరెంట్ సరిగ్గా ఇవ్వక రాత్రి పొలం దగ్గరికి వెళ్లిన చిన్ననెమిల గ్రామానికి చెందిన రైతు రావుల లింగయ్య పాము కాటుతో మరణించారని, దీనికి కారణం ఎవరు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్లు, కరెంట్ రంగాలపై ప్రభుత్వం సమీక్ష సమావేశం నిర్వహించాలని, ఎండిపోతున్న పంటలను పరిశీలించి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. నీళ్లు అందకపోతే తుంగతుర్తి ఎడారి ప్రాంతం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పక్క పెట్టి సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి, సోనియాగాంధీ వద్దకే పరుగులు తీస్తున్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి బతుకు మొత్తం బ్లాక్ మెయిలింగ్ అని, ఆయన మాటలను ప్రజలు పట్టించుకోరని చెప్పారు.

ఈ సమావేశంలో జడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి, రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు ఎస్ఏ రజాక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మున్న మల్లయ్య, నాయకులు భూరెడ్డి సంజీవరెడ్డి, చూడి లింగారెడ్డి, బత్తుల విద్యాసాగర్, బత్తుల విజయ్‌కుమార్, సాయిల్‌గౌడ్, లింగరాజు, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.